www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

సోమవారం
05.10.2026



మన నీళ్లు చంద్రబాబుకు..

రేవంత్‌రెడ్డి సర్కార్‌పై కల్వకుంట్ల కవిత ధ్వజం

రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ, కరవు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో గళమెత్తారు. కృష్ణా జలాల తరలింపు విషయంలో అధికార పక్షం తీరును తీవ్రంగా ఆక్షేపిస్తూ, తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ సీఎం చంద్రబాబుకు తాకట్టు పెడుతోందని ఆమె విరుచుకుపడ్డారు. ఒకవైపు వ్యవసాయానికి నీరందక, మరోవైపు తీవ్ర విద్యుత్ కోతలతో రాష్ట్ర రైతాంగం అల్లాడుతున్నా సర్కారు కరవు మండలాలను ప్రకటించడంలో మీనమేషాలు లెక్కిస్తోందని నిప్పులు చెరిగారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యాలు, అన్నదాతలు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులపై టీఆర్ఎస్ అధినేత కవిత ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంధించిన ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

కలంజ్యోతి, హైదరాబాద్

- కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలి
- రైతులకు 24 గంటల కరెంట్ ఏదీ?
- సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం
- కుప్పంకు కృష్ణా జలాల తరలింపు
- కరవు పరిస్థితులపై సర్కార్ నిర్లక్ష్యం
- పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని వైనం
- రైతాంగానికి టీఆర్ఎస్ పార్టీ అండ

3 లో

ఆధార్‌లో పేరు మార్పుకు కొత్త నిబంధనలు



- ప్రతి మార్పుకు ప్రత్యేక అఫిడవిట్ తప్పనిసరి
- ఇకపై సాధారణ సవరణలు కుదరవు
- పూర్తి పేరు మార్పునకు గెజిట్ అవసరం
- రెండుసార్లు మాత్రమే మార్చుకునే అవకాశం

4లో..



ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే

కీలక ముందడుగు వేసిన సొరంగం పనులు

- క్లిష్టమైన షియర్ జోన్ అధిగమనం
- 2028 జూన్ నాటికి నీటి విడుదల
- భద్రతకు ప్రాధాన్యమిస్తూ వేగవంతం

3లో..

"ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనుల్లో ఎట్టకేలకు అతిపెద్ద అవరోధం తొలగిపోయింది. తవ్వకాలకు పెను సవాలుగా మారి, గతంలో విషాదానికి కారణమైన అత్యంత క్లిష్టమైన షియర్ జోన్ భౌగోళిక భాగాన్ని అధిగమించడంతో ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. కార్మికుల ప్రాణరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత నిస్తూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జర్మనీ నుంచి తెప్పిస్తున్న సరికొత్త యంత్రాల సాయంతో పనుల్లో మరింత వేగాన్ని పెంచేందుకు ఇంజనీరింగ్ యంత్రాంగం సన్నద్ధమైంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మిగిలిన 9.1 కిలోమీటర్ల తవ్వకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, 2028 జూన్ నాటికి కరవు నేలకు సాగునీటిని పారించాలనే పక్కా లక్ష్యంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది."



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 05.10.2026
2
www.kalamjyothi.com



- పెద్ది స్వప్నకు పరామర్శ
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి
- సుదన్న సేవలను స్మరించుకున్న శ్రేణులు

పెద్ది యాదిలో

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 04) : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ప్రజల అభిమాన నాయకుడు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయుని పహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండవీటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. సుదర్శన్ రెడ్డి అకాల మృతితో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన సతీమణి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న రెడ్డిని కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను నాయకులు గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గ ప్రజల కోసం ఆయన చేసిన నిస్వార్థ సేవలను, పార్టీ బలోపేతానికి అందించిన విశేష కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డి మాషి కిషోర్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు రాజు, ఎండీ అప్సర్, చింతల రాములు, కొమ్ముల బాల జోజి, మంద వెంకన్న, గుగులోతు కిరణ్, మంద చిన్ను, సదిరాం, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



మైనర్ల డ్రైవింగ్‌పై కొరడా

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్
- ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై చర్యలు
- ఎస్పీ జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 04) : మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడపడం, వాహనదారుల హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చట్టరీత్యా చర్యలు చేపట్టారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా ప్రాణాంతక ప్రమాదాలకు అవకాశం కల్పించవద్దని తల్లిదండ్రులకు పోలీసులు స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమశిక్షణ, ప్రజల భద్రతే పరమావధిగా జిల్లాలో ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

అన్యాయాలపై నిరంతరం పోరాటం
నూతన కమిటీల ఎన్నిక



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 04) : సమాజంలో మానవ హక్కుల పరిరక్షణకు మరింత చురుగ్గా పనిచేస్తామని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అండ్ మీడియా స్పష్టం చేసింది. సంస్థ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మెరుగు రమేష్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి హైకోర్టు అడ్వకేట్, హ్యూమన్ రైట్స్ అడ్వకసీ అడ్వైజర్, స్థాపకులు సత్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్, రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం, మెరుగు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి సత్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులకు ఎదురయ్యే సమస్యలు, మహిళలు, చిన్నారులపై జరిగే దాడులు, అన్యాయాలపై తమ సంఘం నిరంతరం ప్రశ్నిస్తుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ అసోసియేషన్ ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా పనిచేస్తుందని, సంక్షేమ పథకాల పంపిణీతో పాటు అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ పేద ప్రజలు, మహిళలు, చిన్నారులకు అన్యాయం జరిగితే ప్రశ్నించేందుకు ముందుండాలని సూచించారు.

నూతన కమిటీల ఎన్నిక..

కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా కీర్తి సురేష్, ఉపాధ్యక్షులుగా సీత దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా శైలం బాలరాజు, కార్యదర్శులుగా రేసు మధు, శంకర్ ఠాగూర్, కాలేరు వికాస్, బొజ్జ శ్రీకాంత్‌లను నియమించారు. అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షులుగా మచిక రవీందర్, ఉపాధ్యక్షులుగా కొమ్ముల దిలీప్, ప్రధాన కార్యదర్శిగా వేములపల్లి సునీత, కార్యదర్శిగా పల్నాటి మూర్తిలను నియమించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల నూతన అధ్యక్షులు మాట్లాడుతూ మానవ హక్కులు, మహిళా హక్కులు, బాలల హక్కులకు భంగం కలగకుండా సమాజ సేవ చేస్తామని, రాబోయే రోజుల్లో హక్కుల పరిరక్షణ కోసం మరింత చురుగ్గా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎద్దు రాజు, కేతనబోయిన నాగరాజు, కనుకుంట్ల దిలీప్, పున్నం చందర్, శెట్టి రమేష్, నగేష్, గడల రమేష్, బుర్రి విజయ్ కుమార్, పల్లబోయిన మురళీకృష్ణ, ప్రతాప్ రెడ్డి, సునీల్ కుమార్, చల్ల గురుగుల కుమార్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 04) : నర్సాపూర్ కేంద్రంలోని డీజే హైస్కూల్ 1993, 1994 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాడు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సమావేశమై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పదవ తరగతి చదువుకున్న సహచరులంతా దశాబ్దాల తర్వాత ఒకే వేదికపైకి చేరి పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువుల క్రమశిక్షణే తమను ఉన్నత స్థాయికి చేర్చిందని కొనియాడుతూ, ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి చిలిపి గుర్తులను, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
సోమవారం 05.10.2026
www.kalamjyothi.com



ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 05) : ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు పడింది. తవ్వకాలకు తీవ్ర ఆటంకంగా మారిన అత్యంత క్లిష్టమైన భౌగోళిక షియర్ జోన్ ప్రాంతాన్ని అధిగమించడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష నిర్వహించి ఎస్ఎల్‌బీసీ సహా కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదనపు యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, 2028 జూన్ నాటికి సొరంగం ద్వారా నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కరవు పీడిత ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా సాగు, తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

భద్రతకు ప్రాధాన్యమిస్తూ వేగవంతం..

సొరంగం మొత్తం పొడవు 43.968 కిలోమీటర్లు కాగా ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయ్యాయని, ఇంకా 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. గత ఐదారు నెలల్లో ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్గాల్లో కలిపి సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని కార్మికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ 140 మిల్లీ మీటర్ల మందం కలిగిన పైపులతో రక్షణ కవచం ఏర్పాటు చేసి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఏడు నుంచి ఏడున్నర మీటర్ల మేర పనులు సాగుతుండగా, అక్టోబరులో ఇన్‌లెట్ వద్ద మరో అత్యాధునిక యంత్రాన్ని అందుబాటులోకి తేనున్నారు. జర్మనీ నుంచి తెప్పిస్తున్న ప్రత్యేక రైలు ఈ నెలాఖరుకు చేరుకోనుండటంతో తవ్విన మట్టి, రాళ్లను వేగంగా బయటకు తరలించే వెసులుబాటు కలగనుంది. కొత్త యంత్రాల రాకతో పనుల సమయాన్ని గణనీయంగా తగ్గించి, అక్టోబరు చివరి నుంచి పనుల్లో మరింత దూకుడు పెంచాలని మంత్రి ఆదేశించారు.



బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 04) : ఈ నెల 9న ఆదిలాబాద్ రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ వంటి మహనీయుల ఆలోచనలను రాజకీయ చైతన్యంతో ముందుకు తీసుకెళ్లిన కాన్షీరాం బహుజనులను సంఘటితం చేసి రాజ్యాధికార లక్ష్య సాధనకు కృషి చేశారని గుర్తుచేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బహుజన రాజ్యాధికార సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ యాదవ్, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షులు క్యాతం సాగర్, రాజేష్, దత్తు, సాగర్, సునంద పాల్గొన్నారు.

మన నీళ్లు చంద్రబాబుకు..



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 05) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా సర్కార్ నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందని ఎద్దేవా చేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం..

నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేదని, దానిపల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవని కవిత పేర్కొన్నారు.

కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ పాలమూరురంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 67 గంటల విద్యుత్ కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని భరోసా ఇచ్చారు.



రానున్న ఎన్నికల్లో సత్తా చాటాలి

మహబూబాబాద్ పార్లమెంట్ బాధ్యులు డా. బోడ అనిల్‌నాయక్

- ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ
- పార్టీలో భారీగా చేరికలు

కలంజ్యోతి, మహబూబాబాద్ (అక్టోబర్ 04) : డోర్నకల్ నియోజకవర్గం మర్రిపెడ మండలం రూప్‌సింగ్ తండా గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ బాధ్యులు డా. బోడ అనిల్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. బోడ అనిల్ నాయక్ మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మర్రిపెడ మండలం నుంచి అధిక స్థానాల్లో విజయం సాధించి కవితమ్మకు కానుకగా అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పార్టీలో భారీగా చేరికలు..

టీఆర్ఎస్ పార్టీ ప్రతిపాదిస్తున్న ఐదు పాంచజన్య సూత్రాలైన ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక తెలంగాణ అంశాలను గ్రామస్థాయిలో ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించి, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన సతీష్, శివాజీ, బిచ్చు వెంకటయ్య, ధర్మ జగమాల్, సరోజినమ్మ, అనిత, సరిత తదితరులు పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర బంజారా విభాగం అధ్యక్షుడు కిషన్ నాయక్, నాయకులు సంతోష్, సాయి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో మంత్రుల పర్యటన

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 05) : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లాలో రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఐడీఓసీలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తారు. అనంతరం మంత్రి జూపల్లి మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం మత్తడిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, ఉట్నూరులోని గోండ్ రాజుల కోటను సందర్శించి పర్యాటక అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఇంద్రవెల్లికి చేరుకుని మిస్ ఎర్త్ వాటర్ ఇండియా అవార్డు-2026 విజేత ప్రీతి ముండేను సన్మానిస్తారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి పరిస్థితులను పరిశీలించనున్నారు. ప్రజా సేవా భవన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, డీసీసీ కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన సంక్షిప్త సమావేశానికి హాజరవుతారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
సోమవారం 05.10.2026
www.kalamjyothi.com



రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్షపూరిత వైఖరి
- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకటనారాయణ



కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 05) : మాదన్నపేట రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తూ వ్యాపారులను, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు పనులను పరిశీలించి, స్థానిక వ్యాపారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంట్రాక్టర్‌గా మాదన్నపేట రోడ్డు విస్తరణ పనులను తన ఏజెన్సీకి దక్కించుకుని తొమ్మిది నెలలుగా పనులను సాగదీస్తూ నత్తనడకన నడిపిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు వెడల్పులో భాగంగా నష్టపోతున్న కొందరు షాపు యజమానులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించగా, వారికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి..

కోర్టు తీర్పును వక్రీకరిస్తూ, మీరు కోర్టుకు వెళ్లారు కాబట్టే పనులు చేయడం లేదంటూ అధికారులు, పాలకులు బహిరంగంగా షాపు యజమానులను బెదిరింపులకు గురిచేస్తున్నారని రవీందర్ రెడ్డి ఆరోపించారు. కోర్టు ఆదేశాల ప్రకారం బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి, రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. దసరా పండుగ వేళ ప్రజలకు, వ్యాపారులకు, ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు నల్లా మనోహర్ రెడ్డి, డివిజన్ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు, డివిజన్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ కార్యదర్శి వేనుముద్దుల శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్లు బానోతు నవీన్ నాయక్, బుస శిరీష రాజు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయిడి దుష్యంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపెల్లి రాంప్రసాద్, వార్డు అధ్యక్షులు కడారి కుమారస్వామి, బీరం నాగిరెడ్డి, మంద ప్రసాద్, పైసా ప్రవీణ్, పెండెం వెంకటేశ్వర్లు, సంపంగి సాలయ్య, కందికొండ శ్రీను, గాలి శ్రీను, పూర్ణ చందర్, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు మద్దెల సాంబయ్య, వెల్దండి స్వరూప, వడ్లకొండ స్వరూప, వాసం నాగరాజు పాల్గొన్నారు.

ఆధార్‌లో పేరు మార్పునకు కొత్త నిబంధనలు



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 05) : ఆధార్ కార్డులో పేరు మార్పు లేదా సవరణలకు సంబంధించి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI) సరికొత్త స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (SOP)ను జారీ చేసింది. ఇకపై ప్రతి రకమైన పేరు మార్పునకు ఒకే రకమైన పద్ధతి ఉండదని, మార్పుకు గల కారణాన్ని బట్టి నిర్దిష్ట అఫిడవిట్లు, ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. డేటా ఎంట్రీ తప్పిదం వల్ల పేరు తప్పుగా నమోదైతే పెద్దలు అనెక్చర్‌బీ, మైనర్లు అనెక్చర్‌సి అఫిడవిట్‌ను గుర్తింపు పత్రాలతో జతచేయాలి. వివాహం లేదా విడాకుల అనంతరం ఇంటిపేరు మార్చుకునే వారు అనెక్చర్‌డి అఫిడవిట్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. పేరులో అలియాస్ తొలగించాలనుకుంటే పెద్దలకు అనెక్చర్ఇ, మైనర్లకు అనెక్చర్ఎఫ్ అఫిడవిట్లు అవసరమవుతాయి.

పూర్తి పేరు మార్పునకు గెజిట్ అవసరం

మొదటి పేరు లేదా పూర్తి పేరును సమూలంగా మార్చుకోవాలనుకుంటే సాధారణ పత్రాలు సరిపోవని, తప్పనిసరిగా అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు పాత పేరు ఉన్న గుర్తింపు పత్రాన్ని సమర్పించాలని తాజా నిబంధనల్లో పేర్కొన్నారు. డాక్టర్, కల్నల్, శ్రీ, శ్రీమతి వంటి హోదాలు, బిరుదులను తొలగించుకునేందుకు కూడా ప్రత్యేక నిబంధనలను నిర్దేశించారు. ఆధార్ వ్యవస్థలో జీవితకాలంలో పేరును రెండుసార్లు మాత్రమే మార్చుకునే వెసులుబాటు ఉన్నందున, పౌరులు నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని తగిన కేటగిరీ అఫిడవిట్లు, పత్రాలతోనే ఆధార్ కేంద్రాలను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. పాత ఫార్మాట్ అఫిడవిట్లతో దరఖాస్తు చేస్తే తిరస్కరణకు గురయ్యే అవకాశముందని హెచ్చరించారు.

ఒకే కంటికి రెండు ఆపరేషన్లు!

- కుట్లు విప్పతామని చెప్పి రెండో శస్త్రచికిత్స
- హైదరాబాద్‌లో బాధితురాలి పరీక్షలు



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 04) : వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఓ నిరుపేద వృద్ధురాలి విషయంలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లికి చెందిన కొలిపాక సరోజన(65)కు శుక్లం రావడంతో జూలై 21న కుడి కంటికి ఆపరేషన్ చేసి అద్దం అమర్చారు. శస్త్రచికిత్స జరిగినప్పటి నుంచే తీవ్ర నొప్పి, చూపు మసకబారడంతో పలుమార్లు ఆస్పత్రికి వెళ్లగా కుట్లు విప్పి కన్ను కడగాలని చెప్పి సెప్టెంబర్ 15న మళ్లీ చేర్చుకున్నారు. తీరా డిశ్చార్జ్ పత్రాలు చూస్తే కుడి కన్ను సూడోఫేకియా విత్ ఆప్టిక్ క్యాప్చర్-ఐఓఎల్ డయలింగ్ అని నమోదు చేసి ఉందని, మొదటి ఆపరేషన్‌లో అద్దం సరిగ్గా అమర్చకపోవడం వల్లే రెండోసారి శస్త్రచికిత్స చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

హైదరాబాద్‌లో బాధితురాలికి పరీక్షలు..

రెండుసార్లు ఆపరేషన్ చేసినా చూపు రాకపోవడంతో పాటు కంటి నుంచి నీరు కారుతుండటంతో రూ.25 వేల విలువైన ఇంజెక్షన్ కోసం హైదరాబాద్‌లోని సరోజినీ దేవి ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో బాధితురాలిని హైదరాబాద్‌కు తీసుకురాగా ఇక్కడ కూడా మొదటి నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలోనే రెండు ఆపరేషన్లు చేసి వృద్ధురాలిని తీవ్ర క్షోభకు గురిచేశారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికం వల్లే సర్కారు దవాఖానకు వస్తే ఈ దుస్థితి వచ్చిందని వాపోయారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి మెరుగైన వైద్యంతో పాటు న్యాయం చేయాలని కోరుతున్నారు.





జోయాలుక్కాస్‌లో బ్రిలియన్స్ డైమండ్ షో

- వజ్రాభరణాల కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం
- సరికొత్త డిజైన్లతో అద్భుత ప్రదర్శన

కలంజ్యోతి, హనుమకొండ చౌరస్తా (అక్టోబర్ 04) : ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ హనుమకొండలోని విజయ టాకీస్ ఎదురుగా ఉన్న తమ షోరూమ్‌లో అక్టోబర్ 2 నుంచి బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోను ప్రారంభించింది. ఈ ప్రదర్శన వజ్రాభరణాలలో నైపుణ్యం, సొబగులు, సరికొత్త ఆవిష్కరణల అపురూప వేడుకను అందిస్తుందని జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ డాక్టర్ జోయ్ అలుక్కాస్ తెలిపారు. పెళ్లిళ్లకు వాడే అద్భుతమైన నగల సెట్ల నుంచి నిత్యం ధరించే ఆధునిక ఆభరణాల వరకు, కాలాతీతమైన సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఆభరణాలు ఇక్కడ లభ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రతి డిజైన్ ఒక కళాఖండమని, ఈ ప్రదర్శన జరిగే పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ డైమండ్ జ్యువెలరీ షో వజ్రాల శాశ్వత ఆకర్షణకు, ఆభరణాల రూపకల్పనలోని పరిపూర్ణతకు నివాళి అని వివరించారు. తెలంగాణ తమ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, పండుగల వేళ జరుగుతున్న ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, ప్రత్యేకత, అత్యుత్తమ కళాత్మకతను ప్రతిబింబించే డిజైన్లను ఎంపిక చేసుకునేందుకు చక్కటి అవకాశమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శన సమయంలో రూ.లక్ష, అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి ఉచితంగా ఒక బంగారు నాణెం లభిస్తుందని, ఇది కొనుగోలుదారుల షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును జోడిస్తుందని వెల్లడించారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

అక్షయ్ సరసన దిశా

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సరసన ప్రముఖ నటి దిశా పటానీ మరోసారి నటించనున్నారు. దర్శకుడు సాజిద్ ఖాన్ తెరకెక్కించనున్న భారీ బడ్జెట్ కామెడీ ఎంటర్టైనర్‌లో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు ప్రచారం సాగుతోంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత అక్షయ్ కుమార్, ఆర్. మాధవన్ కలిసి నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటి శ్రియ శరణ్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. లండన్‌లో చిత్రీకరణ జరుపుకోనున్న ఈ సినిమాలో దిశా పటానీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా కడుపుబ్బా నవ్వించే హాస్యభరిత పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల సమాచారం. గతంలో వీరిద్దరూ కలిసి వెల్‌కమ్ టు ది జంగిల్ చిత్రంలో నటించగా, తాజా ప్రాజెక్ట్‌తో మరోసారి అలరించనున్నారు.